క్లుప్తంగా

ఒంటిమామిడి పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ తనిఖీలు



ఒంటిమామిడి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

తొండంగి: మండలంలోని ఒంటిమామిడి పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం రాత్రి జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి సమస్యలపై సిబ్బందితో మాట్లాడారు. అనంతరం పోలీస్ క్వార్టర్స్, పోలీస్‌స్టేషన్ స్థల సరిహద్దులు, క్రైమ్ రేషియో రిపోర్ట్ తదితర వివరాలతో పాటు పలు రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీస్ సిబ్బంది క్వార్టర్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని తుని రూరల్ సీఐ ఎస్‌వీఎస్ మూర్తి, ఎస్సై బి.వినయ్‌ప్రతాప్‌లను ఆదేశించారు.

బాలికల చట్టాలపై అవగాహన అవసరం



ఏలేశ్వరంలో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఏలేశ్వరం: ప్రతిఒక్కరూ మహిళలు, బాలికల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ-2 వరలక్ష్మి సూచించారు. మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వరలక్ష్మి మాట్లాడుతూ బాలికల చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బాలికలు, మహిళల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్యకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది లోవలక్ష్మి, అమలావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ మృతికి సంతాపం

ప్రత్తిపాడు: ఇటీవల ఆత్మహత్య చేసుకున్న నరసాపురం ఎంపీడీఓ వెంకటరమణ మృతికి శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది సంతాపం తెలిపారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు ఎంపీడీఓ ఎస్.డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ విధుల్లో ఒత్తిడిని తట్టుకోలేక ఆయన ఇంటిని విడిచి వెళ్లారని, ఆ తర్వాత శవమై కనిపించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం, పంచాయతీ కార్యదర్శులు ద్విభాష్యం శ్రీనివాసరావు, ఫక్కుర్తి శ్రీనివాసరావు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది సురేష్, రత్నం, సచివాలయాల సిబ్బంది, వైద్యారోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు, బాలికల భద్రతే మిషన్ శక్తి లక్ష్యం



గొల్లలగుంటలో ర్యాలీ చేస్తున్న అధికారులు

జగ్గంపేట: బాలికలు, మహిళల రక్షణ, భద్రతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మిషన్ శక్తి పథకాన్ని ప్రవేశపెట్టిందని జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ అన్నారు. మండలంలోని గొల్లలగుంట ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు శుక్రవారం మిషన్ శక్తిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ మిషన్ శక్తి పథకం వలన బాలికలు, మహిళలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. మహిళలు, బాలికల చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

కిర్లంపూడి: జగపతినగరం అభయదుర్గమ్మ, కిర్లంపూడి గ్రామ శివారున వేంచేసిన వనదుర్గమ్మ ఆలయాల వద్ద శుక్రవారం అన్నసమారాధనలు నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఆలయ కమిటీల సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

తుని: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.రాము డిమాండ్ చేశారు. తుని పట్టణంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు నిరంతర పర్యవేక్షణ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పలువురు ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేటకు వాయుగండం

- ప్రతికూల వాతావరణంతో అల్లకల్లోలంగా మారిన సముద్రం
- చేపల వేట నిలిపివేసిన మత్స్యకారులు
- కోతకు గురవుతున్న సముద్ర తీరం



కొత్త చోడిపల్లిపేటలో కోతకు గురవుతున్న తీరం

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారిన నేపథ్యంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. మండలంలోని తీరం ప్రాంతాల్లో అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. దీంతో వారం రోజులుగా మత్స్యకారులు బోట్లపై చేపల వేటను నిలిపివేశారు. వేట లేకపోవడంతో గంగపుత్రులు ఉపాధికి ఇబ్బందులు పడుతున్నారు.

విస్తారంగా వర్షాలు

వాయుగుండం ప్రభావంతో కోనతీర ప్రాంతంతో పాటు మెట్ట, పల్లపు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. అన్ని గ్రామాల్లోనూ పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణశాఖ ప్రకటించింది. ఈదురు గాలులు, వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

సురక్షిత ప్రాంతాలకు బోట్లు

సముద్రం అల్లకల్లోలంగా మారడంతో వేటకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. అధికారుల సూచనల మేరకు మత్స్యకారులు తమ బోట్లును తీరంలో సురక్షిత ప్రాంతాలకు తరలించుకుని వేటకు విరామం ప్రకటించారు. ఇప్పటికే తీరంలోని అన్ని గ్రామాల్లోనూ మత్స్యకారులను అప్రమత్తం చేశామని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు తెలిపారు. కాగా మండలంలో దాదాపుగా 480 బోట్లు ఉన్నాయి. వేట ద్వారా ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ 10 వేల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. సముద్రంలో వేటకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో మత్స్యసంపదపై ఆధారపడిన గంగపుత్రులు, చిరు వ్యాపారాలు ఇబ్బందులు పడుతున్నారు. సముద్రంలో వేటకు అనుకూల పరిస్థితులు ఏర్పడే వరకూ ఈ ఇబ్బందులు తప్పవని తీరప్రాంత మత్స్యకారులు వాపోతున్నారు.

సముద్రంలో అలల ఉధృతి పెరగడంతో పాటు ప్రతిరోజూ పోటుపాట్లు కాలంలో సముద్రం ముందుకు వస్తూ వెనక్కి వెళ్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలో సముద్రతీరంలో గట్టు కోతకు గురవుతోంది. సముద్రంలో లక్షలాది టీఎంసీల నీరు చేరడంతో క్రమంగా సముద్ర మట్టం పెరుగుతోంది. దీంతో ఏటా తీరం కోతకు గురవుతోంది. ఇప్పటికే ఉప్పాడ, మూలపేట తదితర ప్రాంతాల్లో కొన్ని మత్స్యకార గ్రామాలు సముద్రంలో కలిసిపోవడంతో తమకూ ప్రమాదం తప్పదని తీరప్రాంత మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా బంగాళాఖాతంలో మరో అల్పపీడనం, ఉపరితల ఆవర్తనం ఏర్పడటంతో మరో మూడు రోజుల పాటు ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో వేట మరికొన్ని రోజులు ఉండదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

> **మత్స్యకారులను అప్రమత్తం చేశాం**
>
> 
>
> వాయుగుండం నేపథ్యంలో తీరప్రాంతంలో మత్స్యకార గ్రామాలను అప్రమత్తం చేశాం. సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉంది. ప్రస్తుత వాతావరణం చేపల వేటకు ఏమాత్రం అనుకూలం కాదు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదు.
>
> –సీహెచ్ ఉమామహేశ్వరరావు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి, తుని



పెరుమాళ్లపురం తీరంలో నిలిచిపోయిన బోట్లు

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలి



ఉపాధి కూలీల సమస్యలు వింటున్న రైతు కూలీ సంఘం నేత సతీష్

జగ్గంపేట: మండలంలోని ఉపాధి కూలీలకు బకాయిలు తక్షణమే చెల్లించాలని, పని దినాలు పెంచాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కడితి సతీష్ డిమాండ్ చేశారు. జగ్గంపేటలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం కనీస వసతులైన తాగునీరు, వైద్యం సేవలు అందించటం లేదని విమర్శించారు. ఉపాధి కూలీలు పడుతున్న ఇబ్బందులను తాను స్వయంగా పరిశీంచానన్నారు. ఉపాధి కూలీలకు పని దినాలు, కూలీ రేట్లు పెంచాలని కోరుతూ జిల్లాస్థాయి అధికారులకు వినతి పత్రాలు సమర్పించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు మేలు చేయాలని, 200 రోజుల పనిదినాలు, రోజుకు కనీస వేతనం రూ.300 చెల్లించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించాలని కోరారు.

రూపులమ్మకు ఘనంగా సారె సమర్పణ



ఏలేశ్వరంలో అమ్మవారి సారెతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ఏలేశ్వరం: అషాఢ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలో వేంచేసిన రూపులమ్మ అమ్మవారికి శుక్రవారం ఘనంగా సారె సమర్పించారు. విశ్వహిందూ పరిషత్, అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని సంఘాల ఆధ్వర్యంలో 108 రకాల పిండివంటలను అమ్మవారికి నైవేద్యంగా పెట్టారు. అనంతరం అమ్మవారి ఆలయం నుంచి పట్టణంలోని పలు వీధుల మీదుగా సారెతో ఊరేగింపు నిర్వహించారు. పట్టణానికి చెందిన పలు భజన బృందాల సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ, మాతృశక్తి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశ్వరి, ఇందిరాదేవి, దుర్గావాహిని అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సూర్యాకుమారి, పి.లలిత, తూమురౌతు గురయ్య, ఉడతల రమణారావు తదితరులు పాల్గొన్నారు.

కనక దుర్గమ్మకు సారె సమర్పణ

కిర్లంపూడి: మండలంలోని చిల్లంగిలో వేంచేసిన కనకదుర్గమ్మకు శుక్రవారం సారె సమర్పించారు. స్థానిక గణేష్, గద్వాల్, భౌమా యూత్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని వేగి రాజేష్ ఇంటి నుంచి అమ్మవారి సారెతో మహిళలు గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చిల్లంగి చింతల తోటలో వేంచేసిన కనకదుర్గమ్మ అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



చిల్లంగిలో కనక దుర్గమ్మకు సారె సమర్పిస్తున్న భక్తులు

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి



లంపకలోవలో రైతులకు రాగి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీఏ వీర గంగాధర్

ప్రత్తిపాడు: రైతులు చిరుధాన్యాలపై సాగుపై దృష్టి సారించాలని జగ్గంపేట వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ యింటి వీర గంగాధర్ సూచించారు. మండలంలోని లంపకలోవ రైతు క్షేత్రంలో శుక్రవారం ఆయన సబ్సిడీపై రైతులకు రాగి విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాగులు, కొర్రలు, సామలు, అరికలు, ఊదలు తదితర చిరుధాన్యాల్లో ఎక్కువ పీచు పదార్థం, పోషక విలువలు ఉంటాయన్నారు. తక్కువ పెట్టుబడితో తక్కువ నీటితో ఎకరానికి నాలుగు నుంచి ఎనిమిది క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తుందన్నారు. చిరుధాన్యాల విత్తనాలు 50 శాతం సబ్సిడీపై రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. కేజీ రూ.36.25 వంతున ఎకరానికి నాలుగు కేజీలు పంపిణీ చేస్తామన్నారు. కావలసిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీహోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు హనుమంతువఝ్ఝల అవధాని, ముష్టి పురుషోత్తం, అర్చకులు కోట వంశీ, ఫణిశర్మ, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 25 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు కుంకుమ పూజలు

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు కంచిభట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు కుంకుమ పూజలు నిర్వహించారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



కత్తిపూడిలో స్వచ్ఛత వారోత్సవాలు నిర్వహిస్తున్న అధికారులు



సి.రాయవరంలో స్వచ్ఛత ర్యాలీ చేస్తున్న అధికారులు

శంఖవరం: పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జిల్లా ఆడిట్ అధికారి, మండల ప్రత్యేకాధికారి వై.సురేష్‌బాబు అన్నారు. స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కత్తిపూడిలో ఆయన పర్యటించారు. సచివాలయాలు, డ్రైన్లు, వసతి గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. వీధులు, పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. పంచాయతీ అధికారులు, సిబ్బంది డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చల్లాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మేకల విజయ్‌కుమార్, ఈఓపీఆర్డీ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ

ఏలేశ్వరం: మండలంలోని సి.రాయవరంలో శుక్రవారం పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా ఎంపీడీఓ జె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా రోగాలు దరిచేరవన్నారు. అనంతరం గ్రామంలోని వాటర్‌ట్యాంక్‌ను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి జేవీ సూర్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శాకంబరిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ



గోకవరం వీరభద్రునిగడ్డలో శాకంబరి అలంకారంలో దర్శనమిస్తున్న కనకదుర్గమ్మ

గోకవరం: స్థానిక వీరభద్రునిగడ్డలో కొలువైన కనకదుర్గమ్మ శుక్రవారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం మహిళలు, గ్రామస్తులు, భక్తుల సహకారంతో వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారిని సుందరంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచి ఆలయ అర్చకుడు కుమారశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అధిక వర్షాలతో నువ్వు పంటకు నష్టం



ఎస్‌బీ పేటలో అధిక వర్షాలకు దెబ్బతిన్న నువ్వు పంట

తుని రూరల్: అల్పపీడనం ప్రభావంతో మండల వ్యాప్తంగా ఇటీవల కురిసిన అధిక వర్షాలకు ఆరుతడిగా సాగయ్యే నువ్వు పైర్లు దెబ్బతిన్నాయి. మండలంలోని సుభద్రయ్యమ్మపేట, కొలిమేరు, ఎస్.సూచవరం, కుమ్మరిలోవ, డి.పోలవరం తదితర గ్రామాల్లో రైతులు ఆరుతడిగా నువ్వు పంటను సాగు చేశారు. పిందెలు, కాయలతో పైర్లు ఉండగా ఇటీవల ఐదారు రోజులు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. ఈ వర్షాలకు నేల ఊటబారి ఆరుతడి పంటలు దెబ్బతిన్నాయని సుభద్రయ్యమ్మపేట గ్రామానికి చెందిన రైతులు తెలిపారు. బూడిత తెగులు సోకి పంట నష్టం వాటిల్లిందన్నారు. అధిక వర్షాలకు మండలంలో 30 నుంచి 35 ఎకరాల్లో నువ్వు పంట దెబ్బతింది. దుక్కులు, విత్తనాలకు పెట్టిన పెట్టుబడులు నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

విద్యార్థులకు స్టూడెంట్ కిట్ల పంపిణీ



ఇర్రిపాకలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేసిన నాయకులు

జగ్గంపేట: మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఇర్రిపాక ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జగ్గంపేట కో ఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షురాలు జ్యోతుల మణి కిట్లును అందజేశారు. కాట్రావులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గ్రామ సర్పంచ్ పిట్టా సుగణరావు, మాజీ సర్పంచ్ సుంకర సీతారామయ్య తదితరులు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు.

గండేపల్లి: మండలంలోని యల్లమిల్లి, ఎన్టీ రాజాపురం, మల్లేపల్లి, ఉప్పలపాడు తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

అలంకరణ సామగ్రి తయారీపై శిక్షణ



కాట్రావులపల్లిలో వరికుచ్చులతో తయారు చేసిన సామగ్రి చూపుతున్న విద్యార్థినులు

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హరిత వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వరికుచ్చులతో అలంకరణ సామగ్రి తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు పోలుపర్తి దాలినాయుడు మాట్లాడుతూ నూతన విద్యా విధానం అమలులోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టుచెప్పారు. విద్యార్థులు వినూత్న ఆలోచనా సరళిని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు పలు రకాల కాగితపు బొమ్మలు, అలంకరణ సామగ్రి, వరికుచ్చులు తయారు చేసి ప్రదర్శించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వై.కృష్ణవేణి, వైస్ చైర్మన్ ఎం.దుర్గాప్రసాద్, పాఠశాల హెచ్ఎం పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఐడియా థాన్, రూరల్ స్టార్టప్ పిచ్ పోటీల వాల్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆదిత్య యూనివర్సిటీ వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్టార్టప్ ఫౌండేషన్ (ఐఎస్ఎఫ్) ఐడియా థాన్, రూరల్ స్టార్టప్ పిచ్ పోటీలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు యూనివర్సిటీ వైస్ చైర్మన్ ఎస్.సతీష్‌రెడ్డి తెలిపారు. కాకినాడ రీజియన్‌కు సంబంధించి ఆదిత్య యూనివర్సిటీ ఆతిథ్యమిస్తున్నట్టు చెప్పారు. ఈ పోటీలు ఆగస్టు 12న, ప్రాంతీయ, గ్రామీణ స్టార్టప్ పిచ్ పోటీలు ఆగస్టు 31న జరుగుతాయన్నారు. విజేతలకు సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 4 వరకై అంకురా స్టార్టప్ బస్సు యాత్రలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం పోటీల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో డిప్యూటీ చాన్స్‌లర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ చాన్స్‌లర్ ఎస్. రమాశ్రీ, రిజిస్ట్రార్ జి.సురేష్, కెరీర్ డెవలప్‌మెంట్ డీన్ జేడీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తాండవ ఆయకట్టుకు వచ్చే నెలలో నీరు విడుదల

కోటనందూరు: ఆగస్టు 15 నుంచి 20వ తేదీ లోపు తాండవ ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు డీఈఈ అనురాధ ప్రకటించారు. నాతవరం సెక్షన్ కార్యాలయంలో శుక్రవారం ఆయకట్టు రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయకట్టు రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారుల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు అనేక ప్రాంతాల్లో దెబ్బతిన్న కాలువలకు మరమ్మత్తులు చేయాలని, కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగింపునకు చర్యలు తీసుకోవాలని, శివారు ప్రాంతాలకు నీరు చేరేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. సమావేశం దృష్టికొచ్చిన అన్ని విషయాలను పరిశీలించి నీటి విడుదలపై నిర్ణయం తీసుకున్నట్లు డీఈఈ అనురాధ తెలిపారు. కార్యక్రమంలో జేఈఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ



జగ్గంపేటలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా రిజిస్ట్రార్ రామలక్ష్మి

జగ్గంపేట: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా రిజిస్ట్రార్ రామలక్ష్మి పట్నాయిక్ తనిఖీ చేశారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, రికార్డులను ఆమె పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేసినట్టు ఆమె వివరించారు. కార్యక్రమంలో జగ్గంపేట సబ్ రిజిస్ట్రార్ పి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.